క్లుప్తంగా

అంతరిక్ష పరిశోధనలపై అవగాహన



గుడ్లవల్లేరు: చంద్రయాన్ – 3 ప్రయోగం ద్వారా చంద్రునిపై విక్రమ్ లాండర్‌ను విజయవంతంగా పంపిన ఆగస్టు 23వ తేదీని కేంద్ర ప్రభుత్వం జాతీయ అంతరిక్ష దినోత్సవంగా ప్రకటించిందని అంగలూరు ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ జిల్లా సంస్థ (డైట్) ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మోహినీకుమారి తెలిపారు. జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా డైట్‌లో అంతరిక్ష పరిశోధన వీడియోల ప్రదర్శన, సెమినార్‌ను చేపట్టారు. అధ్యాపకులు డాక్టర్ వినయ్‌కుమార్, ప్రకాశం, రాజ్యలక్ష్మి, జయశ్రీ, శ్రీనివాసాచార్యులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత



గుడివాడరూరల్: ఆటోనగర్‌లో పని చేస్తూ ప్రమాదవశాత్తు బల్లపై నుంచి కిందపడి చెయ్యి విరిగిన తాతా కిరణ్ అనే వర్కర్‌కు యూనియన్ తరపున గురువారం ఆర్థిక సాయం అందచేశారు. కిరణ్ లారీ మరమ్మతులు చేస్తూ ఇటీవల జారిపడ్డాడు. ప్రమాదంలో చెయ్యి మణికట్టు విరిగింది. చికిత్స పొందాడు. ఈ క్రమంలో ఆటోమొబైల్స్ వర్కర్స్ యూనియన్ తరపున యూనియన్ నాయకులు రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని కిరణ్ కుటుంబ సభ్యులకు అందచేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి టి.లక్ష్మణరావు, అధ్యక్షుడు అబ్దుల్ ఆమీద్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఖుద్దూస్, సభ్యులు బి.ఆంజనేయులు, మహ్మద్ రఫీ ద్‌బేగ్, మొహిద్దీన్ బాషా, గాంధీరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

ఎరువుల వాడకంపై అవగాహన



గుడ్లవల్లేరు: మండలంలోని కౌతవరం గ్రామ రైతులకు ఎరువుల వాడకంపై ఏఓ సునీల్ గురువారం అవగాహన కల్పించారు. తమ పొలంలో ఏ మేరకు విత్తనాలను చల్లారనే విషయంపై రైతులను ఆయన అడిగారు. నారుమడుల సమయంలో ఎరువులు వాడాల్సిన విధానాలను వివరించారు. ఆయనతో పాటు స్థానిక రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

యాచకులకు భోజన వసతి



గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం మందపాడు నైట్ షెల్టర్ వద్ద యాచకులకు భోజన వసతి కల్పించారు. క్లబ్ సభ్యుల సహకారంతో భోజనం అందజేసినట్లు క్లబ్ అధ్యక్షుడు ఎం. శివరామకృష్ణ తెలిపారు. ఏ ఆధారం లేక కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ యాచకత్వంపై ఆధారపడి జీవిస్తున్న వీరికి క్లబ్ సభ్యులు అనేక సేవలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కె. రామారావు, కోశాధికారి కె. రామకృష్ణ, షెల్టర్ నిర్వాహకులు లంకపల్లి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

విలక్షణ నటుడు చిరంజీవి

ఎమ్మెల్యే కామినేని



కైకలూరు: పద్మవిభూషణ్ డాక్టర్ కొణిదల చిరంజీవి విలక్షణ నటుడు, సేవాగుణం కలిగిన వ్యక్తి అని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ కొనియాడారు. చిరంజీవి జన్మ దినోత్సవం సందర్భంగా కైకలూరు మాగంటి థియేటర్‌లో అభిమానుల మధ్య కేక్ కట్ చేసి రీరిలీజ్ చిత్రం ఇంద్రను గురువారం తిలకించారు. కూటమి నేతలు కాళ్లపాలెం బుజ్జి, కొల్లి బాబీ, పూల రాజీ, మైగాపుల రామాంజనేయులు, తులసి పూర్ణ, తోట లక్ష్మీ, బలే ఏసురాజు, చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

గుడ్లవల్లేరు: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధించవచ్చునని ఎంపీడీఓ డి.కృష్ణవేణి తెలిపారు. గుడ్లవల్లేరు గ్రామ సచివాలయ ప్రాంగణంలో గురువారం ప్లాంట్ – 4 కార్యక్రమంలో భాగంగా ఆమె చేతుల మీదుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. టీడీపీ నాయకులు వల్లభనేని వెంకట్రావు, పల్లెం నరసింహారావు, వల్లభనేని సుబ్బారావు, కోలా రాధాకృష్ణ, చాపరాల బాలాజీ, పోలవరపు వెంకట్రావు, గ్రామ కార్యదర్శి నరసింహారావు, సచివాలయాల ఉద్యోగులు ఉన్నారు.

మొవ్వ: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టి రానున్న భవిషత్ తరానికి చక్కటి పర్యావరణాన్ని బహుమతిగా ఇవ్వాలని మొవ్వ ఎంపీపీ కొండేటి ఇందిర పేర్కొన్నారు. గురువారం ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమాన్ని మొవ్వ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కొండేటి ఇందిర, ఎంపీడీవో జి.సుధా ప్రవీణ్ కార్యాలయ ప్రాంగణంలో మొక్కను నాటారు. ఈవోపీఆర్‌డీ వీర్ల సీతారామరాజు, ఏపీవో కే లక్ష్మీ రెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పామర్రు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్లాంట్ పర్ మదర్ అనే కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. ఎంపీపీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ కాలుష్య రహిత సమాజానికి మొక్కలు ఎంతో దోహదం చేస్తాయని చెప్పారు.



గుడ్లవల్లేరులో మొక్కలను నాటిన ఎంపీడీఓ కృష్ణవేణి



మొవ్వలో మొక్కను నాటుతున్న ఎంపీపీ కొండేటి ఇందిర, ఎంపీడీవో సుధాప్రవీణ్



పామర్రులో మొక్కలు నాటుతున్న ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్

మొక్కలు ఉన్న చోట ఆక్సిజన్ శాతం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. ఎంపీడీవో వై రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ కె.స్వరూపరాణి, వైస్‌ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ పి.రత్నకుమారి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు , ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఐనంపూడి గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ భట్టు పరంజ్యోతి మొక్కలను నాటే కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతో మొక్కలు నాటించారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మణ్ నాయక్

గుడివాడ టౌన్: విద్యార్థి దశ నుంచే ఎయిడ్స్ వంటి అంటువ్యాధుల పట్ల అవగాహన ఉండాలని చైల్డ్ ఫర్ ఇండియా లింక్ వర్కర్స్ డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ పి. లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. బేతవోలు మున్సిపల్ హైస్కూల్లో హెచ్ఐవీ, అంటువ్యాధులపై విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల దశ నుంచే విద్యార్థులకు లైంగిక అంటువ్యాధులపై అవగాహన కల్పించాలని తెలిపారు. నేక్ ఆధ్వర్యంలో మీకు తెలుసా... అనే కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి. రాకేష్, హెచ్‌ఎం జి. సంధ్యారాణి, ఉపాధ్యాయులు పూజేశ్వరరావు, లింక్ వర్కర్ దేవి, తదితరులు పాల్గొన్నారు. అంకిత ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో మీకు తెలుసా... కార్యక్రమం స్థానిక బీఎస్ఎన్ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాప్తి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎయిడ్స్ రోగుల పట్ల ప్రవర్తించాల్సిన తీరు, వారికి అండగా ఉండాల్సిన అవసరం వంటి అంశాలను ప్రాజెక్ట్ మేనేజర్ జి. లావణ్య వివరించారు. ప్రిన్సిపాల్ బి. సత్యనారాయణ, కార్యకర్తలు కె. లక్ష్మి సరోజిని, కె. పార్వతి, బి. లలిత, బి. నాగ మారుతి, సీహెచ్. క్రాంతి, రాజమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

షిరిడీ సాయి మందిరంలో ప్రత్యేక పూజలు



పామర్రు: స్థానిక సాయినగర్‌లో వేంచేసియున్న షిరిడీ సాయి మందిరంలో బాబాకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తొలుత బాబాకు ఆవుపాలతో అభిషేకాలు చేశారు. భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ అర్చకులు శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త తమ్మా వినోద్ తెలిపారు. షిరిడీ సాయి భక్త సమాజ సభ్యులు బొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, మల్లికార్జునరావు, రాధాకృష్ణ, సాయి, రమేష్, సురేష్, అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ గణపతి హోమం



గుడివాడ టౌన్: స్థానిక మెయిన్‌రోడ్డులో వేంచేసియున్న విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం లక్ష్మీ గణపతి హోమం వైభవంగా నిర్వహించారు. 76 మంది దంపతులు ఈ హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ వీడీడీ ప్రసాద్ మాట్లాడుతూ సంకట హర చతుర్థి పర్వదిన వేడుకల్లో భాగంగా ఈ హోమం నిర్వహించామని తెలిపారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని, పంటలు బాగా పండి రైతులు లాభపడాలని, ఏవిధమైన రుగ్మతలు లేకుండా సమాజం క్షేమంగా ఉండాలనే ఉద్దేశంతో హోమం చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వేద పండితులు కపిలవాయి అశోక్ శాస్త్రి, భక్తులు పాల్గొన్నారు.

నేడు మండలంలో ఉపాధిహామీ గ్రామ సభలు

గుడివాడరూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2024–25 సంవత్సరాలకు సంబంధించి పనులు గుర్తింపునకు శుక్రవారం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అనగాని వెంకటరమణ గురువారం తెలిపారు. అన్ని గ్రామాల్లోని ఒకేరోజు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఆయా గ్రామ పంచాయతీ, సచివాలయాల్లో సర్పంచుల అధ్యక్షతన సభలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఏడాదిలో చేపట్టాల్సిన పనుల గుర్తింపు, గుర్తించిన పనులను మంజూరు చేయుట, పనులు సభలో చదివి వినిపించడం, సోషల్ ఆడిట్ గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. గ్రామ కార్యదర్శులు గ్రామసభల నిర్వహణ గురించి గ్రామాల్లో ప్రచారం చేయించాలని సూచించారు.

నేడు ఉపాధి హామీ గ్రామ సభలు

మండవల్లి: మండలంలోని గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 2024–25 సంవత్సరానికి సంబంధించిన గ్రామసభలు శుక్రవారం నిర్వహిస్తామని ఎంపీడీవో టి.వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు కొవ్వాడలంక, మొఖాసాకలవపూడి, పులపర్రు, ఉదయం 11 గంటలకు అల్లినగరం, అప్పాపురం, భైరవపట్నం, కానుకొల్లు, లోకుమూడి, ఉనికిలి, తక్కెళ్లపాడు, పుట్లచెరువు, పెరికెగూడెం, నుచ్చుమిల్లి, నందిగామలంక గ్రామాల్లో, 2 గంటలకు అయ్యవారిరుద్రవరం, లింగాల, గన్నవరం, చావలిపాడు, మండవల్లి, మణుగునూరు, మూడుతాళ్ళపాడు, పెనుమాకలంక, సింగనపూడి 3 గంటలకు కొర్లపాడు, ప్రత్తిపాడు, చింతపాడు, చింతలపూడి గ్రామాల్లో గ్రామ సభలు జరుగుతాయని చెప్పారు. ప్రజలు పాల్గొని గ్రామసభలను విజయవంతం చేయాలని కోరారు.

పమిడిముక్కల: మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో శుక్రవారం ఉపాధి హామీ పథకం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చీలి విఠల్‌పాల్ తెలిపారు. సర్పంచుల అధ్యక్షతన గ్రామసభలు జరుగుతాయని, గ్రామ సభల పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులను నియమించినట్లు చెప్పారు. ఉపాధి హామీ పథకం కింద పని దినాలు, వేతనాలు, అర్హతలపై అవగాహన కల్పించడం, ఇప్పటికే మంజూరై పురోగతిలో ఉన్న పనులు చదవడం, ఆర్థిక సంవత్సరం 2024–25 కోసం ప్రతిపాదనలు, సామాజిక తనిఖీపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం


డ్రోన్ సాంకేతికతపై రైతులకు అవగాహన

కైకలూరు: కేవలం 5 నుంచి 6 నిమిషాల్లో ఎకరం పొలం పిచికారీ చేసే డ్రోన్ సాంకేతికత అందుబాటులోకి వచ్చిందని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఆర్.గంగాధరరావు తెలిపారు. మండల వ్యవసాయాధికారి ఆర్.దివ్య అధ్యక్షతన తామరకొల్లు శివారు గంగులవానిగుంటలో పొలంబడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్ సాయంతో పురుగుమందు, నానో ఫెర్టిలైజర్స్ పిచికారీ వలన సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. కలిదిండి మండలం సానారుద్రవరం గ్రామానికి చెందిన మారుబోయిన సాయిరాం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో డ్రోన్ నడపడంలో ఉచిత శిక్షణ తీసుకొని ధ్రువపత్రం పొందారన్నారు. క్షేత్ర స్థాయి డెమో ఇవ్వడానికి వచ్చిన సాయిరాం మాట్లాడారు. అనంతరం గురుగుబిల్లి పాండురంగారావు పొలంలో డ్రోన్ పనితీరును ప్రయోగాత్మకంగా అందరికీ చూపించారు. డ్రోన్ ద్వారా పిచికారీ అవసరమైన రైతులు 8498942619 సెల్ నంబర్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వీవీఏలు కె.శ్రీనివాస్, జి.ధర్మతేజ, వి.గోపినాథ్, జె.కనకదుర్గ, రైతులు బోయిన సత్యనారాయణ, గంగుల శ్యామలరాజు తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్ సాంకేతికతను వివరిస్తున్న ఏడీ గంగాధరరావు

కొల్లేరు విద్యార్థులకు నగదు బహుమతులు



బహుమతులు అందుకున్న కొల్లేరు ప్రాంత విద్యార్థులతో జేసీ పి.ధాత్రిరెడ్డి తదితరులు

ఏలూరు (టూటౌన్): పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ చూపిన కొల్లేరు గ్రామాల విద్యార్థులకు జేసీ పి.ధాత్రి రెడ్డి గురువారం నగదు బహుమతులు అందజేశారు. కొల్లేరు నాయకుడు సైదు గంగరాజు 101వ జయంతి సందర్భంగా కొల్లేరు నాయకురాలు ఘంటసాల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా యాదవ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జేసీ పాల్గొని మాట్లాడారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకుని తల్లిదండ్రులు, ఊరికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తూ ప్రోత్సహిస్తున్న సైదు గంగరాజు కుటుంబ సభ్యులు, వెంకటలక్ష్మిని జేసీ అభినందించారు. కొల్లేరు ప్రజల వేదిక కన్వీనర్ చింతపల్లి వెంకటనారాయణ, పైడిచింతపాడు సర్పంచ్ ముంగర వెంకటేశ్వరరావు, శృంగవరప్పాడు మాజీ సర్పంచ్ ఘంటసాల రామాంజనేయులు, సైదు మృత్యుంజయరావు, సైదు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు అంకమ్మతల్లి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు

పామర్రు: శ్రావణ మాసం పురస్కరించుకుని స్థానిక విజయవాడ రోడ్డులో వేంచేసియున్న అంకమ్మతల్లి ఆలయంలో శుక్రవారం సువాసినిలతో సామూహిక కుంకుమ పూజ నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ అధ్యక్షులు వరదా అప్పారావు గురువారం పేర్కొన్నారు. భక్తులందరూ కుంకుమ పూజలో పాల్గొని అమ్మవారి రూపు, లడ్డూ ప్రసాదం స్వీకరించాలని కోరారు. ఇతర వివరాల కోసం ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించాలని తెలిపారు.

దరఖాస్తుకు నేటితో గడువు ముగింపు

మొవ్వ: క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న హిందీ గెస్ట్ లెక్చరర్ పోస్టు భర్తీకై దరఖాస్తుల ఆహ్వానం శుక్రవారం సాయంత్రం 4గంటలతో ముగియనున్నదని కళాశాల ప్రిన్సిపాల్ కె.ప్రసాద శాస్త్రి తెలిపారు. యూజీసీ గుర్తింపు పొందిన యూనివర్సిటీలో ఎంఏ హిందీ పూర్తి చేసి ఉండాలని, 50 శాతం మార్కులతో పాస్ అయిన వారు అర్హులని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు కళాశాలలో దరఖాస్తులను అందించాలని సూచించారు. 24వ తేదీ మచిలీపట్నంలోని లేడి యాంప్టిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్వ్యూ, డెమో లెక్చర్ ఉంటుందన్నారు.

మెరుగైన సేవలు అందించేందుకు కృషి

మండవల్లి: వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా సమర్థవంతమైన సేవలు అందజేయడానికి కృషి చేస్తున్నామని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ కె.జ్యోతిప్రసాద్ తెలిపారు ఇండియన్ బ్యాంక్ వద్ద గురువారం నిర్వహించిన కస్టమర్ మీటింగ్‌లో జ్యోతిప్రసాద్ మాట్లాడారు. సమావేశానికి హాజరైన మాజీ సర్పంచులు గుడివాడ చిట్టిబాబు, తమ్మిస్వామి, ఎల్ఎస్ భాస్కరరావు, మెండా సురేష్, రాజేష్, పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం బ్యాంక్‌లో సరిపడా అధికారులు, సిబ్బంది లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. సమయం వృథా అవుతుందన్నారు. ఏటీఎం సరిగా పని చేయడం లేదని పేర్కొన్నారు. బుక్ కీపర్లు తేలు శ్యామల, ఝాన్సీ, నళిని, బీసీలు మహాలక్ష్మి, వెంకట కళ్యాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇండియన్ బ్యాంక్ మేనేజర్ జ్యోతిప్రసాద్

వైఎస్ జగన్‌ను కలిసిన డీఎన్నార్

కైకలూరు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కైకలూరు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) తాడేపల్లిలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు ఏలూరు జిల్లా ముఖ్య నాయకులు పాల్గొన్నారు. డీఎన్నార్ కైకలూరు సర్పంచ్‌గా, రాష్ట్ర సర్పంచుల సంఘ ఉపాధ్యక్షుడిగా, ఎమ్మెల్యేగా పనిచేశారు. పార్టీ ఆదేశించిన కార్యక్రమాలను తూచా తప్పకుండా అమలు చేస్తారనే పేరుంది.



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో కైకలూరు మాజీ ఎమ్మెల్యే డీఎన్నార్

రామనపూడి జెమీ పంటకాల్వ పునరుద్ధరణ

సాక్షి కథనానికి స్పందన

గుడివాడరూరల్: వందల ఎకరాలకు సాగునీరు అందించే జెమీ పంట కాల్వ పామర్రు–కత్తిపూడి జాతీయ రహదారి విస్తరణ పనుల్లో కనుమరుగైపోవడం వలన రైతులు పడుతున్న ఇబ్బందుల గురించి ఈ నెల 10వ తేదీన 300 ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకం అంటూ సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కాల్వను తవ్వుతామంటూ ఇచ్చిన మాటను నిర్లక్ష్యం చేయడం వలన రైతులు పడుతున్న బాధలను సాక్షి వెలుగులోకి తీసుకురావడంతో అధికారులు కాల్వ పునర్నిర్మాణంపై దృష్టిపెట్టారు. పొక్లెయిన్‌తో కాల్వ పునరుద్ధరణ పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. గురువారం నాటికి 70 శాతం కాల్వ తవ్వకాల పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను పూర్తి చేసి రైతులకు కాల్వను అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు తెలిపారు. సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపిన సాక్షి పత్రికకు రైతన్నలు ధన్యవాదాలు తెలిపారు.



శరవేగంగా జరుగుతున్న కాల్వ నిర్మాణ పనులు

ఫ్లైఓవర్‌కు ఇరువైపులా రైలింగ్ ఏర్పాటు

గుడివాడరూరల్: ప్రమాదాలకు నిలయంగా మారిన ఫ్లై ఓవర్‌కు ఎట్టకేలకు ఇరువైపులా రైలింగ్ నిర్మాణ పనులను గురువారం అధికారులు చేపట్టారు. వంతెన దాటిన తర్వాత రోడ్డుకి ఇరువైపులా రైలింగ్ లేకపోవడంతో వాహనాలు అదుపు తప్పి రోడ్డు ప్రమాదాలు జరగడం నిత్యకృత్యంగా మారింది. ప్రమాదాల్లో కొందరు ప్రాణాలు కోల్పోయిన ఘటనలూ ఉన్నాయి. ప్రమాదకరంగా మారిన ఫ్లై ఓవర్‌కు రైలింగ్ నిర్మాణం చేపట్టాలని వాహనదారులు ఎప్పటి నుంచో అధికారులకు విన్నవించుకున్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దృష్టికి సమస్యను తీసుకెళ్లగా పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. రైలింగ్ నిర్మాణం చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు ఇరువైపులా స్తంభాలు పాతి ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు. వాహనదారులు, పరిసర ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రైలింగ్ ఏర్పాటుకు స్తంభాలు వేసేందుకు పొక్లెయిన్‌తో పనులు చేస్తున్న దృశ్యం

కొల్లేరు ఉక్కుమనిషి సైదు గంగరాజు

ఎమ్మెల్యే కామినేని

కైకలూరు: కొల్లేరు గ్రామ ప్రజల ఉక్కుమనిషిగా దివంగత సైదు గంగరాజు పేరు గడించారని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చెప్పారు. గంగరాజు 101వ జయంతి సందర్భంగా శృంగవరప్పాడులో ఆయన విగ్రహానికి గురువారం నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కొల్లేరు గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా గంగరాజు నిరంతరం కష్టపడ్డారన్నారు. కొల్లేరులో చేపల చెరువుల ద్వారా ప్రజలకు ఉపాధి కల్పించడంలో కీలకభూమిక పోషించారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుర్మేళ్ల బేబీ, సర్పంచ్ ఘంటసాల భాగ్యలక్ష్మి, నాయకులు బలే ఏసురాజు, ఘంటసాల జగన్నాథం, కొల్లి బాబీ, ముంగర ఏడుకొండలు, పూలా రాజీ, ఘంటసాల సీతారామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



సైదు గంగరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

ఎస్ఆర్‌జీఈసీకి మైటీ టైడ్ 2.0 అవార్డు

గుడ్లవల్లేరు: శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు మైటీ టైడ్ 2.0 అవార్డును కైవసం చేసుకున్నారు. ఈ విషయాన్ని ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కరుణకుమార్ గురువారం విలేకర్లకు తెలిపారు. స్టార్టప్ కంపెనీలుగా అవతరించగల ఆవిష్కరణలను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా నీతి అయోగ్ మద్దతు సంస్థ ఏఎల్ఈఏపీ డబ్ల్యూహెచ్‌యూబీ మైటీ టైడ్ 2.0 పథకం ద్వారా హ్యాకథాన్ నిర్వహించారన్నారు. ఈ పోటీలో తమ కాలేజీ ఏఐ అండ్ డీఎస్ విభాగపు థర్డ్ ఇయర్ విద్యార్థులు కె.రాఘవేంద్ర కార్తీక్, ఎ.షణ్ముఖ శ్రీనివాస్ తలపడ్డారన్నారు. ఆక్వాసాగుపై దృష్టి సారించి జలవాయు సంస్థ పేరిట ఒక ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేసి ప్రదర్శించారన్నారు. ఆటో డీ–ఆక్సిజన్ ప్రాజెక్ట్‌కు అర్హత పొంది... రూ.లక్ష అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని ఏపీ మైక్రో స్కేల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజ్, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా తమ విద్యార్థులు పొందారన్నారు. అవార్డు గ్రహీతలను ప్రిన్సిపాల్ కరుణకుమార్‌తో పాటు కళాశాల సలహాదారు డాక్టర్ పి.రవీంద్రబాబు, డైరెక్టర్ డాక్టర్ జి.ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోదండ రామారావు, అధ్యాపకులు అభినందించారు.

కైకలూరులో శాంతి ర్యాలీ

కైకలూరు: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి ర్యాలీ కైకలూరులో గురువారం నిర్వహించారు. మానవత అధ్యక్షురాలు కొండ్రెడ్డి చిట్టమ్మ నేతృత్వంలో శ్యామలాంబ దేవస్థానం నుంచి తాలూకా సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. మాతా స్కూల్, జాగృతి స్కూల్ విద్యార్థులు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



శాంతి ర్యాలీ చేస్తున్న మానవత సభ్యులు

నూకాలమ్మ ఘటం ఊరేగింపు

రావివారిపాలెం(మోపిదేవి): రావివారిపాలెంలోని శ్రీ నూకాలమ్మ గ్రామ దేవత ఘటం బిందె ఊరేగింపు కార్యక్రమం గురువారం ప్రారంభించారు. శ్రావణమాసం సందర్భంగా ఉదయం కృష్ణానదిలో పుణ్యస్నానమాచరించి మోపిదేవి గ్రామంలో ఊరేగింపుగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. మాజీ సర్పంచ్ రావి బాబూరావు, గొరిపర్తి అంతిరాజు ఇంటివద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐదు రోజులపాటు మోపిదేవి, రావివారిపాలెం పురవీధుల్లో ఘటం బిందె ఊరేగింపు ఉంటుందని ఆలయ కమిటీ తెలిపింది.

